క్లుప్తంగా

8న ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

పెనగలూరు : ఈనెల 8వ తేదీన స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పీడీ డాక్టర్ ప్రణవి తెలిపారు. పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆట స్థలంలో అండర్-14, అండర్-17 వారు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, టెన్నీ కాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలలో బాలబాలికలు మండల స్థాయిలో పాల్గొనవచ్చన్నారు. ఆటల పోటీలలో పాల్గొనే బాలబాలికలకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు.

నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలను అందజేస్తున్న రవిశంకర్

సిద్దవటం : నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువులను బుధవారం అందజేసినట్టు మన ఊరి కోసం సేవా సంస్థ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్రిష్ణపురం గ్రామానికి చెందిన చల్లా గంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరగడంతో మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కీ.శే. డాక్టర్ మందూరు రామయ్య వర్థంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు రెండు నెలల సరిపడా నిత్యావసర వస్తువులతోపాటు రూ.వెయ్యి నగదును అందజేశామని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామక్రిష్ణ, సుధీర్, సామల చెంగయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ 2023 - 2024 సంవత్సరం జిల్లా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ పాఠశాల మొదటి బ్యాచ్ (ఆయన క్లాస్‌మేట్స్) విద్యార్థులు పట్టణంలోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అక్కడే ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకోవడం గర్వించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మాసాపేట ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య, ఇంగ్లిష్ టీచర్ ముదివేటి చిన్నరెడ్డెప్ప, కుర్రపోతుల జీవానందం, జగిలి రాచరాయుడు, మద్దికాయల చౌడయ్యలు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుక



కేకును కట్ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

చిట్వేలి : ఏపీఎస్ఆర్టీఎస్ ప్రొఫెషనల్ కో-ఆర్డినేటర్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి 64వ పుట్టినరోజు వేడుకలను మంగళవారం రాత్రి చిట్వేలిలోని ఆయన సొంత గృహంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి, ఇంతియాజ్ అహ్మద్, లాయర్ బాలాజీ, కోటేశ్వరరెడ్డి, నాగేశ్వర్, నరసింహ నాయుడు, వెంకటరెడ్డి, సాయి, పవన్, రాజు, సింధూ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు

వీరబల్లి (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలో నెట్‌కేఫ్ మేనేజర్ ఎర్రంరెడ్డి దాతృత్వంతో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ఎంపీపీ దాతల సహకారం కోరారు. దీనిపై స్పందించిన ఎర్రంరెడ్డి మండల కేంద్రంలోని అన్ని ప్రాంతాలకు కావాల్సిన మొత్తం బల్బులు, వాటికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసి వారికి అందించారు. వీటిని బుధవారం విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు దాతను, ఎంపీపీని అభినందించారు.



వీధిలైట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట



సంక్షేమ పథకాలను అవ్వాతాతలకు వివరిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

- సీఎం జగన్ పాలనలో సామాజిక న్యాయం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేశామని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని గొర్లముదివీడు గ్రామంలో ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఆరవవాండ్లపల్లె, ఏపీలవంక పల్లె, వల్లూరు వాండ్లపల్లె, చెరువుముందర కొత్తపల్లె, బోయపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, హరిజనవాడలలో గడప గడపను శ్రీకాంత్ రెడ్డి సందర్శిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీలు ఇతర అణగారిన వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్సార్ చేయూత, నేతన్న హస్తం, రజకులు, టైలర్లు, నాయీబ్రాహ్మణులు, ఆటోవాలాలకు ఆర్థిక సహాయం, బీసీ విద్యార్థుల తల్లులకు అమ్మఒడి తదితర పథకాలు ద్వారా సింహభాగం బీసీలు, అణగారిన వర్గాలు లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. 82 వేల మంది బీసీలు రాజకీయ సాధికారతతో పదవుల్లో ఉన్నారని, బీసీల హృదయంలో జగన్.. జగన్ హృదయంలో బీసీలున్నారన్నారు. బాలిరెడ్డిగారిపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి టీటీడీ ఢిల్లీ ప్రాంతీయ సలహా మండలి సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో సత్కరించి, భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు.

ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు..

ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌దే అని ఏపీలవంకపల్లె ముస్లిం కుటుంబాలు పేర్కొన్నారు. శ్రీకాంత్ రెడ్డిని ముస్లింలు అక్కున చేర్చుకున్నారు. జగన్ పాలనలో ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తింపు చేయడం, మౌజం, ఇమామ్‌లకు గౌరవ వేతనం, హజ్ యాత్రికులకు ప్రయాణపు ఛార్జీలో రాయితీ తదితర సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. జగన్ వెంటే నడుస్తామని ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యే ఎదుట స్పష్టం చేశారు.

అక్కా చెల్లెమ్మలకు అండగా వైఎస్సార్ ఆసరా

అక్కా చెల్లెమ్మలకు అండగా వైఎస్సార్ ఆసరా నిలిచిందంటూ ఎమ్మెల్యే ఎదుట డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డితో మహిళలు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మహిళా సంఘాలను భారీ సమావేశాలకు తరలించుకున్నారే తప్పా వారికి లబ్ధి చేకూర్చింది లేదన్నారు. డ్వాక్రా అక్కా చెల్లెమ్మలను లక్షాధికారులుగా చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సమాజ పరిస్థితులకు అనుగుణంగా మహిళల్లో మార్పు రావాలన్నారు. మహిళలను వ్యాపార రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. మహిళల భద్రతకోసం దిశా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందంటూ ఎమ్మెల్యే ఎదుట మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగిరెడ్డి, పల్లపు రమేష్, సింగల్ విండో అధ్యక్షుడు బసిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ మల్ రెడ్డి, సర్పంచ్ రాజమ్మ, రఘునాథ, కాంట్రాక్టర్ చలమా రెడ్డి, స్థానిక నాయకులు రాజారెడ్డి, బిసి నాయకుడు ఈశ్వరయ్య, చెన్నకృష్ణ, రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, షేక్ రియాజ్ బాషా, మహేష్ రెడ్డి, రఘునాథ, పక్కిర రెడ్డి, దస్తగిరి రెడ్డి, ప్రేమనాథరెడ్డి, అల్తాఫ్, రమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలతో మెరుగైన పునరావాసం



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ, అగ్రహారం గ్రామాలకు మెరుగైన పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మంగంపేట ఆర్ఆర్ - 5లో కల్వర్టు, రోడ్డు పనులకు ఆయన పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు అన్ని మౌలిక సదుపాయలతో మెరుగైన పునరావాసం కల్పిస్తామన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఏపీఎండీసీ అధికారులతో ఇప్పటికే చర్చించారని చెప్పారు. ఏపీఎండీసీ నిధులు రూ. 1.42 కోట్లతో కల్వర్టు, సిమెంటు రోడ్డు పనులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, రైల్వేకొడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు గజ్జల శ్రీనివాసులురెడ్డి, వేణ కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ,దేవకూమార్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

రైల్వేకోడూరు : నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తి చేసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించి రైల్వేకోడూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులను కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. తక్షణం స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని కొరముట్ల తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన తీజ్ వేడుకలు



వెదురు బుట్టలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వస్తున్న గిరిజన యువతులు

రాయచోటి అర్బన్ : బంజారా తీజ్ ఉత్సవాలు బుధవారం సాయంత్రం రాయచోటి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బంజారా తీజ్ ఉత్సవ కమిటీ, ఏపీ గిరిజన సమాఖ్యల ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా బంజారా యువతులు ఎస్‌యన్‌కాలనీలోని సాయిబాబా మందిరం నుంచి ఉపవాస దీక్షలతో బుట్టలలో మొలకెత్తిన గోదుమ బుట్టలను నెత్తిన పెట్టుకుని సాంప్రదాయ నృత్యాలు నడుమ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్ మాట్లాడుతూ అఖండ భారతావనిలో వందల ఏళ్ల నుంచే బంజారాల పండుగలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయన్నారు. యువతులు తమకు మంచి వరుడు కావాలని దైవాన్ని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో తీజ్ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.గిరిజన యువతులు యువతులు 9 రోజుల పాటు అత్యంత నిష్టగా ఉపవాసాలు ఉంటారన్నారు. పండుగలో భాగంగా మొదటగా పుట్టమట్టిని తీసుకవచ్చి వెదురుబుట్టలో వేసి అందులో గోదుమలు పోసి మొలకలు పెంచుతారన్నారు. బుట్టల్లో మొలకలు ఎంత పచ్చగా ఉంటే భవిష్యత్‌లో అంత ఆయురారోగ్యాలు, సంతోషాలు కలుగుతాయని గిరిజన యువతుల నమ్మకం అన్నారు. 9వ రోజున మొలకలున్న బుట్టలను సాంప్రదాయరీతిలో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజన యువతులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న దృశ్యం

ఆరోగ్యమాత ఆశీస్సులు పొందుదాం

కడప కల్చరల్ : నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం పోరుమామిళ్ల డీన్ విచారణ గురువులు రెవ ఫాదర్ జాల విజయభాస్కర్ దివ్యబలి పూజను సమర్పించగా, మరియతల్లి సందేశాన్ని బి.కోడూరు విచారణ గురువులు రెవ ఫాదర్ అరుణ్‌కుమార్ అందించారు. గురువులు మాట్లాడుతూ ఎనిమిది రోజుల పాటు ఈ క్షేత్రంలో ఆరోగ్య మాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించామన్నారు. ఆరోగ్య మాత స్వరూపాన్ని అలంకరించి పల్లకిలో క్షేత్ర ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా చిన్ని క్రిష్ణయ్యల సందడి

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీరిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు గోపిక, శ్రీ కృష్ణుడి వేషధారణలు కనువిందు చేశాయి. అనంతరం విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పండెంట్ టి.యువరాజ్, దామోదరవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలి : మండల పరిధిలోని చిల్లావాండ్లపల్లిలో వెలసిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ప్రారంభమై బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. బుధవారం ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, మహాన్యాసపారాయణం, తీర్థ ప్రసాద వినియోగంతోపాటు స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి కల్యాణం కనుల పండువగా సాగింది. రాత్రి అన్నదానం చేశారు. ఆర్కెస్ట్రా భక్తులను అలరించింది. గురువారం గ్రామోత్సవం నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలియజేశారు.

రాయచోటి టౌన్ : శ్రీకృష్ణ భగవానుడి పుట్టుక మహాద్భుతమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధిలోని గొర్లమొదివీడు గ్రామంలోని ఏపి లంకపల్లెలో శ్రీకృష్ణాష్టమి పూజలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణపరమాత్ముడు మానవత్వంలో దైవత్వాన్ని చూపించాడని చెప్పారు. యుగయుగాలుగా శ్రీకృష్ణుడి తత్వం మానవుడిని విశేషంగా ప్రభావితం చేసిందని చెప్పారు. అనంతరం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఏపిలంకపల్లెకు వెళ్లగా ఆ గ్రామానికి చెందిన ప్రజలు ఓ చిన్నారి శ్రీకృష్ణుడి వేషధారణలో ఘనంగా స్వాగతం పలికారు. ఆ చిన్నారిని తన భుజానికి ఎత్తుకొని ముద్దాడి ఆశ్వీరదించారు. కార్యక్రమంలో పోలు సుబ్బారెడ్డి, పల్లపు రమేష్, గంగిరెడ్డి, బసిరెడ్డి సిద్దారెడ్డి, సర్పంచ్ రాజమ్మ, రఘునాథ, చలమారెడ్డి, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, చెన్నకృష్ణ, రామిరెడ్డి, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా, స్థానికులు



రాయచోటి టౌన్: చిన్ని క్రిష్ణుడిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే

చిన్నమండెం : మండలవ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలోని చిన్నారులను వారి తల్లిదండ్రులు కృష్ణుడు, గోపికలుగా తయారు చేశారు. కృష్ణుడి చిట్టి అడుగులను వేయించారు. అదే విధంగా పలు ఆలయాల్లోనూ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడా

రాజంపేట : కురుపాండవ సంగ్రామంలో విశ్వరూపాన్ని చూపించి గీతను బోధించి, తద్వారా మానవాళికి జ్ఞానామృతాన్ని ప్రసాదించిన దైవం శ్రీకష్ణభగవానుడని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. భక్త కన్నప్ప జన్మస్థలి ఊటుకూరులో బుధవారం కృష్ణాష్టమి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఊటుకూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణభగవానుడికి జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణతత్వాన్ని చెప్పుటుకు వేయి తలలు కలిగిన ఆదిశేషునికే సాధ్యము కాలేదన్నారు. కృష్ణుడి జ్ఞానబోధతో అందించిన గీతామృతం మానవాళికి ఆదర్శప్రాయమన్నారు. తల్లిదండ్రులు వారివారి పిల్లలకు చేసిన కృష్ణుని వేషధారణలు ఆకట్టుకున్నాయి. వారిని ఆప్యాయంగా పలుకరించి, వారిని ఎత్తుకొని ఎమ్మెల్యే ముద్దాడారు. కార్యకమంలో ఊటుకూరు వైఎస్సార్‌సీపీ నేత నాగా పృథ్వీరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కృష్ణారావు యాదవ్, సుండుపల్లె జెడ్పీటీసీ ఇస్మాయిల్, నాయకులు రాజేష్, పాలగిరి మల్లికార్జునరెడ్డి, నరసింహులు, ఆకుల వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయుడు సుబ్బయ్య, పెద్దలు సుబ్బరాజు, నాగేశ్వరరాజు, మలిశెట్టి పాండు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: ఉట్టి కొడుతున్న విద్యార్థి



చిట్వేలి: వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



చిన్నమండెం: రాధాకృష్ణుడి వేషధారణలో చిన్నారులు